క్లుప్తంగా

ధ్రువపత్రాల పరిశీలన



అంగన్‌వాడీ ఆయా పోస్టుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మద్రిపాలెం: ఇటీవల అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం ఐసీడీఎస్ మద్రిపాలెం సీడీపీవో రమణకుమారి పరిశీలించారు. అర్బన్ పరిధిలో 12 ఆయా పోస్టులకు సంబంధించి 23 మంది దరఖాస్తు చేసుకోగా.. నాలుగు నిరాకరించామని, ఎంపికైన 19 మందికి కాల్ లెటర్లు అందజేశామని ఆమె తెలిపారు. ఎంపికైన వారు శనివారం ఉదయం 9 గంటలకు విశాఖ ఆర్డీవో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



నివాళులర్పిస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: భారతీయ జనసంఘ్ స్థాపకుడు, జాతీయ వాద నాయకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ శుక్రవారం సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణు కుమార్‌రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు గంకల అప్పారావు, పోతురాజు, శంకరరావు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

మురళీనగర్: అమరావతి విశ్వసాహితి ఆధ్వర్యంలో మాధవధారలోని భరద్వాజ క్షేత్రంలో శనివారం పుస్తకావిష్కరణ నిర్వహించనున్నట్లు విశ్వసాహితి సంస్థ కార్యదర్శి పీఎల్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డాక్టర్ పి.సింహాచలం బాలసాహిత్య రచన అమ్మ దీవెన కవితా సంపుటిని ఆవిష్కరిస్తామన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరుగుతుందని, సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీలు

మద్రిపాలెం: నగరంలో నేరాలు నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు శుక్రవారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్, క్రైం సీఐ కె.దుర్గాప్రసాద్, ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావుల నేతృత్వంలో కంచరపాలెం మెట్టు వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి చర్యలు చేపట్టారు.

డ్రగ్స్ కట్టడికి సమష్టి కృషి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ తదితరులు

దొండపర్తి: మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని వ్యవస్థలు సమష్టిగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ సూచించారు. డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను సీపీ శుక్రవారం తన కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సమర్థవంతంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో దాడులు పెంచడం ద్వారా మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టే విధంగా మరింత సమర్థవంతంగా పని చేయాలని ఎస్ఈబీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జిరావు, జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఏఈఎస్ బి.శ్రీనాథుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వార్డుల్లో అభివృద్ధి పరుగులు



50వ వార్డులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, పంచకర్ల రమేష్‌బాబు, కె.కె.రాజు, కార్పొరేటర్లు



51వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్లు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- గిరిప్రదక్షిణ రోడ్డు పున:నిర్మాణానికి శంకుస్థాపన

మద్రిపాలెం: జీవీఎంసీ వార్డుల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నట్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలోని 45, 46, 48, 49, 50, 51 వార్డులను ఆనుకుని ఉన్న గిరిప్రదక్షిణ రోడ్డు పున:నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపనలు నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు మేయర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. రూ.4,48,46,000 జీవీఎంసీ నిధులు, రూ.4,40,00,000 15వ ఆర్థిక సంఘం నిధులతో మాధవధార 48 బస్‌స్టాప్ నుంచి మారియట్ హోటల్ వరకు గిరిప్రదక్షిణ రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కౌన్సిల్ ఏర్పడ్డాక ఆయన ఆదేశాల మేరకు అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎప్పటి నుంచో ఉన్న గిరిప్రదక్షిణ రోడ్డు పున:నిర్మాణానికి గానూ సుమారు రూ.9 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు.

సంక్షేమంలో ఆదర్శం: కె.కె.రాజు

సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ నగరంలోకి వెళ్లేందుకు వీలుగా, జాతీయ రహదారికి సమానంగా మారియట్ హోటల్ నుంచి 45వ వార్డు వరకు 60 అడుగుల రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎంతో కాలంగా ఈ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. సంక్షేమం విషయంలో ఏ విధంగా దేశానికి ఆదర్శంగా నిలిచామో.. మౌలిక వసతుల విషయంలో కూడా ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి న్యాయం చేయాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, గంకల కవిత, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఈఈ శ్రీనివాస్, డీఈ భరణి, ఏఈలు అర్చన, గుప్త, రమణమ్మ, పార్టీ నాయకులు కిరణ్‌రాజు, పేడాడ రమణికుమారి, శ్రీకాంత్‌రాజు, వార్డు అధ్యక్షులు నీలి రవి, పి.సునీత, డైరెక్టర్లు పైడి శ్రీను, ఎస్.రవికుమార్, దిడ్డి రమేష్, ప్రసూనారెడ్డి, సీనియర్ నాయకులు రాజంరాజు, విశ్వనాధరాజు, తిరుమలరావు, అమర్‌రెడ్డి, భగాతి విజయ్‌కుమార్, పైడి ప్రతాప్, నారాయణస్వామి, వసంతల అప్పారావు, చిన్నా, షేక్ బాబ్జి, పొన్నాడ అప్పారావు మాస్టర్, రాజు, గురువోజి, కర్రి రామరెడ్డి, విజయ్, రత్నం, లక్ష్మణ్, వరలక్ష్మి, ధర్మవతి, సరస్వతి, శ్యామ్, జగదీష్, ధనుంజయ్, శివాజీ, కిషోర్, సుధాకర్, మున్నా, గణేష్, వినోద్, గృహసారథులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే సీఎం జగన్ ధ్యేయం

సీతంపేట: ప్రజా శ్రేయస్సు కోరుకునే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 25వ వార్డు రాజేంద్రనగర్ సచివాలయం పరిధిలోని హరిజన వీధి, కనకమ్మ వీధి ప్రాంతాల్లో శుక్రవారంగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని నివాసులుక వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి అధికారం చేపట్టాక విస్మరించిదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి వారి వినతుల మేరకు నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు మేలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతికి, లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూశారని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం అనుక్షణం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలంతా ఉండాలని కె.కె.రాజు కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, 25వ వార్డు నాయకులు సానబోయిన సురేష్, భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, హరికృష్ణ, ముప్పల సంతోష్, సమ్మెట్ల వెంకటేష్, సన్నీ, అశోక్, రవి, గోవిందమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



25వ వార్డులో వృద్ధురాలితో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

విద్యుత్ షాక్‌తో లైన్‌మేన్ మృతి

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో లైన్‌మేన్ మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కరాసకు చెందిన సూర్రెడ్డి(26) ఏడేళ్లుగా ప్రైవేట్ కాంట్రాక్ట్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 50వ వార్డు మురళీనగర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు పోల్ ఎక్కి లైట్లు మరమత్తు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయారు. దీంతో గాయాలైన అతడిని కేజీహెచ్‌కు తరలించగా.. మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సూర్రెడ్డి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి..



గణేష్ బార్ వద్ద చిన్నసూర్యం మృతదేహం

సీతమ్మధార: పూటుగా మద్యం తాగిన ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సబ్బవరం మండలం ఆరిపాక గ్రామంలో పమ్మిడి చిన్న సూర్యం కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట మద్యం తాగి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడి బయటకు వచ్చేశాడు. రెండు రోజులుగా పూటుగా మద్యం తాగి ఉన్న నేపథ్యంలో శుక్రవారం డైమండ్ పార్కు ఎదురుగా గల గణేష్ బార్ వద్ద అతడు మృతి చెంది ఉండటంతో స్థానికులు గమనించి డయల్ 100కు కాల్ చేశారు. ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిన్న సూర్యం మృతదేహన్ని కేజీహెచ్‌కు తరలించారు. గతంలో మృతుడు లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు.

రైళ్ల రద్దు, గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా–తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి–మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా–పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి–హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్–అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వలన ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

నాపల్లి డ్యాన్సింగ్ సూపర్‌స్టార్ గ్రాండ్ ఫినాలే నేడు

సీతంపేట: నాపల్లి డ్యాన్సింగ్ సూపర్‌స్టార్ సీజన్ 6 గ్రాండ్ ఫినాలే పోటీలు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి గురజాడ కళాక్షేత్రంలో జరుగుతాయని నిర్వాహకుడు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ రంజన్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష్, రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు.

ఈ పోటీలకు ఇండియన్ హిప్‌హాప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్, బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. మొదటి బహుమతిగా రూ.1 లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన మిల్లెట్ స్నాక్స్ అందుబాటులోకి తెచ్చిన గంధం ఫుడ్స్ నాపల్లి ఈ ఈవెంట్‌కు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంజన్‌నాయక్ కోరారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల క్రమశిక్షణ, శరీర ధారుడ్యం, విద్యార్థుల్లో ఐక్యత, సేవాభావం కలుగుతాయన్నారు. పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్ కేటాయించిన ఆర్మీ అధికారి కల్నల్ అజయ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్మీ ఉన్నతాధికారి కల్నల్ అజయ్‌కుమార్, పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎం.ఎ న్.వి.విశ్వనాధం ఆధ్వర్యంలో విద్యార్థులకు రన్నింగ్, పుషప్స్, సిట్‌అప్స్ ద్వారా శారీరక ధారుడ్యం ఉన్న 50 మంది విద్యార్థులను ఎన్‌సీసీ కేడెట్ శిక్షణకు ఎంపిక చేశారు. నగర పరిధిలో జీవీఎంసీ పాఠశాలల్లో మొదటి సారి ఎన్‌సీసీ యూనిట్ రావడానికి విశేష కృషి చేసిన ఎన్‌సీసీ అధికారి విశ్వనాథాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనరస, సుబేదార్ మేజర్ కె.కె.సజీవన్, సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఉన్నత పాఠశాలల పనుల పరిశీలన

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ, కేఎస్ఎం గర్ల్స్ హైస్కూళ్లను శుక్రవారం 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదులు తదితర నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో పాఠశాల సిబ్బందిని అడిగి ఆమె తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన చేయించాలని, విద్యార్థులకు ఇబ్బందులకు కలిగించకూడదని సూచించారు.



రైల్వే న్యూకాలనీ హైస్కూల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

వైభవుడిని దర్శించిన వెంకయ్యనాయుడు



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

తాటిచెట్లపాలెం: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు శుక్రవారం కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయన జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ దేశంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. వెంకయ్యనాయుడు కుటుంబ సభ్యులు ఆలయానికి గోమాతను బహూకరించారు. ఈ గోమాతకు నామకరణం కూడా ఆయనే చేయాలని కోరడంతో వాత్సల్య అని పేరు పెట్టారు. ఆలయ ఈవో, అర్చకులు వెంకయ్యనాయుడును ప్రత్యేకంగా సన్మానించారు.

'జగనన్న సురక్ష' ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి



మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాచురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వం అర్హులై ఉండి ఏకారణం చేతనైనా.. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఇంటింటినీ జల్లెడ పట్టి మరీ వారికి లబ్ధి అందించేలా చర్యలు తీసుకోనుందన్నారు. ఎవరికైనా సర్టిఫికెట్లు అవసరమైతే జనన, మరణ, కుల, ఆదాయ, సీసీ ఆర్సీ కార్డులు, రేషన్ కార్డు, డివిజన్ హౌస్ హోల్డ్ మొదలైన 11 రకాల సర్వీసులు ఫీజు లేకుండా ఉచితంగా ప్రజలకు అందిస్తారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, కె.కామేశ్వరి, చల్లా రజని, కె.వి.ఎస్.శశికళ, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

దొమ్మేటి విగ్రహావిష్కరణ రేపు



సమావేశంలో పాల్గొన్న శెట్టిబలిజ సంఘ నేతలు

సీతంపేట: ఈ నెల 25న తణుకు పట్టణంలో శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి కట్టా మల్లేశ్వరరావు తెలిపారు. సీతంపేటలోని ఒక ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తణుకు పట్టణం పాతవూరు ఎన్టీఆర్ పార్కు వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా విగ్రహావిష్కరణ, అనంతరం బహిరంగ సభ, అతిథులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. శెట్టిబలిజ సంక్షేమం, అభ్యున్నతికి సంఘాన్ని స్థాపించి విశేష కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అటువంటి ఆదర్శనీయుడి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శెట్టిబలిజ కులస్తులు, సంఘ పెద్దలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేసి శెట్టిబలిజల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కడలి సుబ్బారావు, వసరాల బాలకృష్ణ, పిల్లి జయరామ్, కడలి శివకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, సోలార్ ఎనర్జీ హోల్డింగ్స్, శ్రీఎస్ బిజినెస్ ఇన్ఫో సర్వీసెస్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, ఆటోమోటివ్, వరుణ్ మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 715 ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు 569 మంది అభ్యర్థులు హాజరైతే 428 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి.హెచ్.సుబ్బిరెడ్డి, ఎ.సంగీత చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని సుబ్బిరెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'కు మండల స్పెషల్ ఆఫీసర్లు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల(ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషినల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.


కనువిందుగా విద్యార్థుల కార్నివాల్

- ఘనంగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

సీతమ్మధార: విద్యా, వినోద, విజ్ఞాన వేదికగా సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విశ్వఖ్యాతి పొందిందని స్కూల్ జనరల్ మేనేజర్ రెవరెండ్ ఫాదర్ బి.సురేష్‌బాబు తెలిపారు. స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను శుక్రవారం ఘనంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థి బృందాలు నిర్వహించిన కార్నివాల్ కనువిందు చేసింది. మ్యూజికల్ బ్యాండ్, పట్నాయక్ మాస్టర్ సారథ్యంలో ఏంజెల్ వేషధారణల్లో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. ముఖ్య అతిథిగా సురేష్‌బాబు మాట్లాడుతూ సుమారు 50 ఏళ్ల పాటు లక్షలాది మందికి సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యా, విజ్ఞాన రంగాల్లో సేవలు అందిస్తోందన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ఆర్జిస్తున్నారని చెప్పారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మనోజ్ జార్జ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను ప్రోత్సహించడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని పేర్కొన్నారు. 2024లో జరిగే గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ప్రతి నెలా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ సురేష్‌బాబు తదితరులు గాలిలోకి బెలూన్ వదిలారు. స్కూల్ ముఖద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గాజువాక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ జోజి, చినవాల్తేరు కోటక్ సాలేసన్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విజయశేఖర్, ఫాదర్ జోషఫ్, ఫాదర్ టి.వి.జోసెఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్నివాల్ నిర్వహిస్తున్న విద్యార్థులు



బెలూన్ వదులుతున్న జనరల్ మేనేజర్ ఫాదర్ సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ మనోజ్ జార్జ్

లలితా పీఠంలో వారాహి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో ఈ నెల 19 నుంచి జరుగుతున్న వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం వారాహి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా వారాహిదేవి అమ్మవారికి సహస్ర నామార్చన చేసి, ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యం సమర్పించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దోమల నిర్మూలనపై అవగాహన

సీతంపేట: వారం రోజులకు మించి తాగునీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ మలేరియా ఇన్‌స్పెక్టర్ బంధం శ్రీనివాసరావు అన్నారు. 26వ వార్డు అక్కయ్యపాలెం చిన్నూరు మసీదు వద్ద శుక్రవారం ఫ్రైడే–డ్రైడే అవగాహన ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.